ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత


సదస్సులో పాల్గొన్న రిటైర్డ్ వింగ్ కమాండర్ శ్రీనివాస్ తదితరులు

మేడ్చల్‌రూరల్: రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ వింగ్ కమాండర్, మైక్రోవేవ్ సిస్టమ్స్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏఐసీటీఈ– వాణి ఆరోగ్య సంరక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీప్ లెర్నింగ్ టెక్నాలజీని ఉపయోగించుకుని హెల్త్ కేర్ అప్లికేషన్స్ ఎలా ఉపయోగించాలో ఈ కార్యక్రమం ద్వారా సామాన్యులు అవగాహన పొందవచ్చని తద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునని తెలిపారు. సీఎస్ఐ హైదరాబాద్ సభ్యురాలు రమా పట్నాయక్ మాట్లాడుతూ అన్ని రకాల సమస్యలకు సాంకేతికతతో పరిష్కారాలు పొందుతున్నారన్నారు. ఆరోగ్య సంరక్షణ అప్లికేషన్లు ఎలా పనిచేస్తాయి. మానవ జీవన విధానంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. డీప్ లెర్నింగ్ టెక్నాలజీతో ఆరోగ్య సంరక్షణ అప్లికేషన్స్ మాతృ భాషలో బోధించడం కళాశాలకు దక్కిన గౌరవమని, సదస్సు కోసం 100కు పైగా కళాశాలలో దరఖాస్తు చేసుకోగా తమ కళాశాల ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్, కోఆర్డినేటర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఘట్‌కేసర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించిన అనంతరం వైద్యాధికారి డాక్టర్ కోట్యా నాయక్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రి, ఉప్పల్ పీహెచ్‌సీలో ఎలీసా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఈఎన్‌టీ విభాగం ఓపీ సేవలు పెంచాలని ఆదేశించారు. ప్రసవం కోసం వచ్చే వారి వివరాలు, బర్త్ డోస్, టీకాలు, డయాలిసిస్ విభాగాన్ని పరిశీలించారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు, పురుషులు, మహిళలు వార్డులు సందర్శించి సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతాపసింగారంలో పల్లె దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రఘునాథస్వామి, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, జంగయ్యయాదవ్, కుమార్‌ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

ఓపీ శాతం పెంచాలి

పోచారం: పల్లె దవాఖానాల్లో ఔట్ పేషెంట్స్ శాతాన్ని పెంచాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం ఆయన అన్నోజిగూడలోని పల్లె దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో అంటు వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నందున వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మురికివాడల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, పేద ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం దవాఖానాలోని రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, డీఎమ్‌హెచ్‌ఓ డా. రంగనాథ్‌స్వామి, కమిషనర్ వేమనరెడ్డి, డా.కౌశిక్, డా.నగేష్, డా.శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నోజిగూడలో పల్లె దవాఖానాలో తనిఖీలు చేస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

శివార్లపై డెంగీ పంజా

జిల్లాలో 162 డెంగీ కేసులు నమోదు

- రావల్‌కోల్‌లో డెంగీతో ఒకరిమృతి
- అదే స్థాయిలో టైఫాయిడ్ ఫీవర్ బాధితులు
- రెండు నెలల్లో 83 డెంగీ కేసులు
- శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు.

సాక్షి,సిటీబ్యూరో: నగర శివార్లపై డెంగీ పంజా విసురుతోంది. బస్తీలు ,పల్లెల్లో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 162 డెంగీ కేసులు నమోదు కాగా, టైఫాయిడ్, చికెన్ గున్యా, విష జ్వరాలకు సంబంధించిన కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. వర్షాల కారణంగా దోమలు విజృంభిస్తుండటంతో డెంగీ, టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మేడ్చల్ మండలం రావల్‌కోల్‌లో ఓ వ్యక్తి డెంగీతో బాధపడుతూ మృత్యువాత పడ్డాడు. శివారు బస్తీలు ,పల్లెల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందకపోవడంతో నగరలోని ప్రైవేటు ఆసుపత్రులకు బారులు తీరుతున్నారు. ఏటా వర్షాకాలం ప్రారంభంలో పల్లె ప్రగతి పేరిట పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ ఏడాది పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో వాటి నిర్వహణ అటకెక్కింది. ప్రత్యేకాధికారుల పాలన ఉన్నా పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పల్లె ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. జిలాల్లో జూన్‌లో 30, జులైలో 53 డెంగీ కేసులు నమోదు కావటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిధుల మంజూరు లేదు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు లేదా మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు చుట్టపు చూపుగా గ్రామాలకు వస్తుండటంతో పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారి పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడింది. గత ఆరునెలలుగా పంచాయతీలకు నిధులు మంజూరు కాకపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. అడపాదడపా నిర్వహిస్తున్నారే తప్ప... మాస్ క్లీనింగ్ లేకుండా పోయింది.

కొరవడిన సమన్వయం..

జిల్లా అధికార యంత్రాంగం పంచాయతీరాజ్, వైద్యారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించినా... ఇందుకు విరుద్ధంగా శాఖల మధ్య సమన్వయం కొరవడి ఎవరికి వారే అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీలు, బస్తీల్లో సమస్యలు పేరుకుపోయాయి.

అత్యధిక కేసులు ఇక్కడే..

మల్కాజిగిరి, ఉప్పల్, కుషాయిగూడ, నారపల్లి, బోడుప్పల్ , మేడ్చల్ జవహర్‌నగర్,బాలానగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అత్యధికంగా డెంగీ కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్ వంటి రోగాలు ప్రబలు తుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదను ప్రైవేట్ ఆసుపత్రులు పరీక్షలు ,వైద్య సేవల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారు.

పత్తాలేని ఫాగింగ్..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతాలైన మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతోపాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడ్చల్ మున్సిపల్ పట్టణాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు స్వైర్వ విహారం చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం ఫాగింగ్ చేయాలన్న ఊసే మరచిపోయారు. పురపాలికల్లో అభివృద్ధి పర్యవేక్షణ కమిషనర్లదే అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భవానీనగర్, చర్లపల్లి, మల్లాపూర్, నాచారం, జీడిమెట్ల ,కుషాయిగూడ, ఇసీఐఎల్, ఏఎస్‌రావు నగర్, నేరెడ్‌మెడ్, మౌలాలి, బాలానగర్, గాజులరామారం తదితర శ్రామిక వాడల్లో కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీం



పోచారం: జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా నారపల్లికి చెందిన మహ్మద్ ఇబ్రహీం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు డా.సుక్రు డానియేల్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతలను అకుంఠిత దీక్షతో నిర్వర్తిస్తానన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సగ్గు వేణుమాధవ్, జితేందర్ సింగ్, డా. కే.వెంకన్న బాబు, స్థానిక నాయకులు మహ్మద్ యూసుఫ్, అంజన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ బీసీ కులానికి చెందిన వారు కాదని బీఆర్‌ఎస్ పార్టీ పీర్జాదిగూడకు చెందిన ప్రతినిధులు మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, బీసీ కమీషన్, రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. మహారాజుల వంశమని పిలువబడే క్షత్రియ, రాజ్‌పుత్ వంశానికి చెందిన కార్పొరేటర్ 2020లో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసి గెలిచారని ఆరోపించారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పెర్కొన్నట్లు వివరించారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ ప్రతినిధులు రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణపై అధ్యయనం

పోచారం: పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు నిలయాలుగా మారిన ప్రాంతాలను మంగళవారం పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారి 163 పైన, చౌదరిగూడలోని కొన్ని ప్రాంతాలను పరిశీలించి, తరచుగా ప్రమాదాలు చోటు చేసుకోవడానికి గల కారణాలను గుర్తించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. వాహనాల వేగాన్ని తగ్గించడం, యూటర్న్ దగ్గర బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, వాహన చోదకులతో పాటు పాదచారులు పాటించాల్సిన నియమాలపై బోర్డుల ఏర్పాటు చేయడం ద్వారా నివారణ చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో సీఐ బి.రాజు, ట్రాఫిక్ సీఐ డి.రవికుమార్, ఎస్సైలు బి.నాగార్జునరెడ్డి, ఎ.కృష్ణయ్య, ఆర్‌అండ్‌బీ ఏఈఈ సీహెచ్ రంజిత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి కుమారి, ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్ నరేంద్ర, చౌదరిగూడ గ్రామ కార్యదర్శి పి.శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.


యాక్సిడెంట్ జోన్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు


అధికారులతో మాట్లాడుతున్న సీఐ రాజు

కారుణ్య నియామకాలు చేపట్టాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మల్కాజిగిరి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యుల్లో ఒకరికి వెంటనే ఉద్యోగం కల్పించాలన్నారు. అధికారులు కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని, పనిభారం పెంచుతూ.. వారాంతపు సెలవు ఇవ్వడం లేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించినా వారికి వేతనంలో కోత విధించడం సరికాదన్నారు. పీఎఫ్ ఖాతాకు జీహెచ్‌ఎంసీ నుంచి డబ్బులు జమచేయడం లేదన్నారు. పలు సమస్యలను కార్మికులు ఎదుర్కొంటున్నారని పరిష్కరించడంలో చొరవ చూపకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, మండల కార్యదర్శి నర్సింగరావు, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు నాగరాజు, బాబూరావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డు ఈడబ్ల్యూఎస్ కాలనీలో స్వామి వివేకానంద సామాజిక భవనం వద్ద వనమహోత్సవం కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఇంటింటికి ఐదు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంచడానికి విరివిగా మొక్కలు నాటి కాపాడాలన్నారు. వనమహోత్సవం విజయవంతం చేయడానికి యువత చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మీనా, నజీర్, రాందాసు, రాజాచారి, లక్ష్మయ్య స్థానికులు పాల్గొన్నారు.


ఈడబ్ల్యూఎస్ కాలనీలో మొక్కలు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

నాగారం మున్సిపాలిటీలో..

కీసర: వన మహోత్సవంలో భాగాంగా నాగారం మున్సిపాలిటీలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని ఎస్వీనగర్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొమురెల్లి అనితా సుధాకర్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటడంతో పాటు, ఇంటింటికి 6 మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మున్సిపల్ పరిధిలో లక్ష్యానికి మించి మొక్కలను నాటడంతోపాటు, వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు బిక్షపతి, నర్సింహ్మా, నాయుడు, బీమా నాయక్, నర్సింహ, వీరయ్య, చారీ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నాగారం మున్సిపల్ 9 వ వార్డులో..

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మోహన్ (ఫైల్)

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పి.మోహన్(26) నగరంలోని నాచారం ఇందిరానగర్‌లో నివసిస్తూ.. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం ఉదయం 9 గంటలకు తన ద్విచక్ర వాహనంపై మేడిపల్లి వైపు వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మేడిపల్లి అనుటెక్స్ షాపింగ్‌మాల్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

పోచారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోచారం సీఐ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 20న ఉప్పల్‌కు చెందిన మచ్చ మురళీధర్, తన భార్య మేఘన (40)తో కలిసి బైక్‌పై రాంపల్లిలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో అన్నోజిగూడలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద వీరి బైక్‌ను వెనక నుంచి వేగంగా వస్తున్న ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వారు ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మేఘనను మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి


మురళి (ఫైల్)

మేడ్చల్‌రూరల్: చేపలు పట్టేందుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని పూడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మండల మురళి (28) తల్లితో కలిసి కొన్ని నెలలుగా ఘనాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం చేపలు పట్టేందుకు సమీపంలోని వాగుకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. స్థానికులు, కుటుంబీకులు మంగళవారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓఆర్‌ఆర్‌పై బియ్యం లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

ఘట్‌కేసర్: బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీ ఓఆర్‌ఆర్‌పై బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హరియాణా రాష్ట్రం, మేవాత్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ వహిద్ ఖాన్ మంగళవారం ఉదయం కరీంనగర్‌లో బియ్యం లోడ్ చేసుకుని రాయచూర్‌కు బయలుదేరాడు. లారీ ఘట్‌కేసర్ ఓఆర్‌ఆర్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ వహిద్ ఖాన్, మరో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఘట్‌కేసర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. బాధితులను ఘట్‌కేసర్ పోలీసులు, టోల్‌గేట్ సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

కీసర: కీసర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కీసర మండల వ్యవసాయాధికారి మాధవీలత అన్నారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు గల రైతు మాత్రమే బీమాకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు రైతు పట్టాదారు పాస్‌బుక్, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు తో కీసర మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 5 వరకు అవకాశముందన్నారు. గతంలో రైతు బీమా ఉన్న రైతులు తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే జూలై 30లోగా తమను సంప్రదించాలని సూచించారు.

మట్టి రోడ్లతో అవస్థలు


అత్వెల్లి రాఘవేంద్రనగర్ రహదారుల దుస్థితి ఇదీ

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలోని అత్వెల్లి, రాఘవేంద్రనగర్ కాలనీ పాలకుల నిర్లక్ష్యానికి బలవుతోంది. కాలనీ ఏర్పడి దాదాపు 20 ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేకపోవడంతో కాలనీ వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రహదారులు అభివృద్ధి చేయకపోవడంతో చినుకుపడితే కాలనీ బురదమయం అవుతుంది. ఇళ్లకు వెళ్లాలంటే బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీలో సీసీ రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి


మాట్లాడుతున్న సింగిరెడ్డి వెంకటరెడ్డి

కీసర: రాష్ట్రంలో బీసీ కుల గణన వెంటనే ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కీసరలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కేసీఆర్ తరహాలోనే బీసీలకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తే బడుగు, బలహీన వర్గాల తరపున బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ నేతలు మెట్టు కృష్ణాయాదవ్, కోల బాల్ రాజ్‌యాదవ్, నల్లవెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని రెడ్డి కాలనీలో సుమారు రూ.11.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే బీఎంఎస్ ధ్యేయం


బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నేతలు

మేడ్చల్: కార్మికుల సంక్షేమమే బీఎంఎస్ ధ్యేయమని (భారతీయ మజ్దూర్ సంఘ్) ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు లిఖిత్‌కుమార్, నిర్మాణ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మంగళవారం నిర్మాణ విభాగం కార్మికుల ఆధ్వర్యంలో మేడ్చల్‌లో బీఎంఎస్ 70వ ఆవిర్భా దినోవ్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు బైక్ ర్యాలీలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద యూనియన్‌గా బీఎంఎస్ ఎదిగిందని, కార్మికుల కోసం పని చేయడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మాణ మజ్దూర్ సంఘ్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి గంగాధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి భార్గవ్, ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, కోశాధికారి నరసింహారెడ్డి, కేశవులు, కృష్ణారెడ్డి, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, రసూల్ పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

కాప్రా: బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే ఫలహారం బండి ఊరేగింపు కాప్రా గాంధీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆషాడమాసంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించిన అనంతరం (పలారం) ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్, స్థానికులు సత్యనారాయణ, పవన్‌కుమార్, విఠల్‌నాయక్, మల్లారెడ్డి, నరేందర్‌గౌడ్, రాకేష్ యాదవ్, సంతోష్‌చారి, పూర్ణయాదవ్ పాల్గొన్నారు.

